# అధ్యాయం 5

## 5.1.2 అనువాదకుడి లక్షణాలు

### విషయ క్రమం

1. ఉద్దేశం
2. ప్రవేశిక
3. అనువాదకుడికి ఉండాల్సిన ప్రధానమైన లక్షణాలు
4. ముగింపు
5. ఉపయుక్త గ్రంథాల సూచిక

---

### 1. ఉద్దేశం

---

ఈ పాఠంలో అనువాదకుడి పాత్ర గురించి పునశ్చరణం చేసి, అతనికి ఉండాల్సిన లక్షణాల గురించి చర్చించటం జరుగుతుంది. ఈ పాఠం పూర్తయిన తర్వాత మీరు అనువాదకుడికి ఉండాల్సిన లక్షణాలను వివరించగలరు.

---

### 2. ప్రవేశిక

---

ఈ ఆధునిక ప్రపంచంలో అనువాదం భాషల మధ్య వారిధిగా ఉపయుక్త పడుతున్నది. తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటి అనువాదకుడు ఆది కవి నన్నయ. ఎవరైనా అనువాద వృత్తిని చేపట్టలేరు. అనువాదకుడు కావటం అంత సులభమైన పని కాదు. దీనికి సహజమైన ప్రతిభ, పాండిత్యం, అభ్యాసం మొదలైనవాటితో పాటు దృఢ నిశ్చయం కూడా అవసరం. ఏదైన అనువాదం చేయాలంటే అనువాదకుడికి కొన్ని అర్హతలు ఉండాలి.

"అనువాదప్రక్రియలో అనువాదకుడికి ఉండవలసిన లక్షణాల తారతమ్యతను బట్టి, అతడి అనువాదస్థాయి ఆధారపడి ఉంటుంది"

అని నిర్మల్ (2000: 22) తెలియజేశారు.

పదండి ఇప్పుడు అనువాదకుడికి ఉండాల్సిన ప్రధానమైన లక్షణాలను పరిశీలిద్దాం.

---

## 3. అనువాదకుడికి ఉండాల్సిన ప్రధానమైన లక్షణాలు

అనువాదమంటే మూలభాషలోని ఆలోచనలను, భావాలను, విషయాన్ని లక్ష్యభాషలోకి అనువర్తించటమని ముందే తెలుసుకున్నాం. అనువాదకుడు రెండు వేర్వేరు భాషలకు, రెండు భిన్న సంస్కృతులకు మధ్యవర్తివంటివాడని చెప్పవచ్చు. అనువాదకుడు పదాలను అనువదించేవాడు మాత్రమే కాడు; మూల రచనలోని ముఖ్యాంశాలను భావి పాఠకులకు అందజేయటానికి ఉత్తమ మార్గాన్ని ఎంపిక చేసేవాడు కూడా. మూల రచనకు ప్రత్యామ్నాయంగా పనిచేయటంతో పాటు, మూల భాష తెలియని పాఠకులకు విషయాన్ని అర్థమయ్యేట్లు చేయటమే అనువాదం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఇది అనువాదకుడికి అసాధ్యమైనపూట.

- **భాషాజ్ఞానం**

అనువాద ప్రక్రియ విజయవంతంగా జరగాలంటే అనువాదకుడికి మూలభాషతోను, లక్ష్యభాషతోను పరిచయం ఉండటం ఎంతో అవసరం. అనువాదకుడు లక్ష్యభాషలో రచన చేస్తాడు. కాబట్టి లక్ష్యభాషా స్వరూప స్వభావాలు అతనికి పూర్తిగా తెలిసి ఉండటం ఎంతో అవసరం.

- **మూలభాషా జ్ఞానం**

అనువాదకుడికి మూలభాషా పరిచయం ఉండటం అవసరం. మూలభాషా జ్ఞానం అనేది భాషాజ్ఞానమే కాకుండా మూలభాషకు సంబంధించిన సంస్కృతీపరమైన వైశిష్ట్యాలు, వాఙ్మయ సాంప్రదాయాలు, పదప్రయోగాలు, పదబంధాలు, జాతీయాలు, నుడికారాలు మొదలైన అంశాలను గురించి అనువాదకుడికి క్షుణ్ణంగా తెలిసి ఉండాలి (నిర్మల్, 2000). ప్రతి భాషలో కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. ఉదాహరణకు కొన్ని భాషల్లో ప్రత్యయాలు, ఇంకొన్ని భాషల్లో ఉండే సంధి నియమాలవల్ల వచ్చే మార్పులు, లింగవచన భేదాలు మొదలైన వాటిగురించి అనువాదకుడు బాగా తెలిసి ఉండాలి.

భాషాజ్ఞానంతోపాటు అనువాదకుడు మూలభాషా సాహిత్యంలో ఉండే వైశిష్ట్యాలగురించి కూడా జ్ఞానం కలిగి ఉండాలి. మూలభాషతో అంతగా పరిచయం లేనప్పుడు అనువాదకుడు మూలభాషతో పరిచయం ఉన్నవాళ్ళ సహాయంతో అనువాదం నిర్వహించవచ్చునని రాధాకృష్ణ (2003) తెలిపారు.

- **లక్ష్యభాషా జ్ఞానం**

మూలభాషని విషయాన్ని ఏ భాషలోనికి అనువాదం చేస్తున్నామో అది లక్ష్యభాష అని ముందే తెలుసుకున్నాం. అనువాదకుడికి మూలభాషతోపాటు లక్ష్యభాషా జ్ఞానం కూడా ఎంతో అవసరం. లక్ష్యభాషకు సంబంధించిన సంస్కృతీపరమైన వైశిష్ట్యాలు, వాఙ్మయ సాంప్రదాయాలు, పదప్రయోగాలు, పదబంధాలు, జాతీయాలు, నుడికారాలు మొదలైన అంశాలను గురించి సముచితమైన అవగాహన ఉండాలి. ఈ అవగాహన అభివ్యక్తికి తగినంత బలం చేకూరుస్తుంది. ఈ అవగాహన లోపంవల్ల అనువాదంలో దోషాలు సంభవించవచ్చు. తత్ఫలితంగా మూలభావశైలీ వైశిష్ట్యానికి తగిన విధంగా లేకపోవటంచేత అనువాదం పాఠకుణ్ణి ప్రభావితం చేయలేకపోతుందని నిర్మల్ (2000) తెలియజేశారు.

విజ్ఞానశాస్త్రం, గణితశాస్త్రం మొదలైన విషయ ప్రధానమైన రచనలను అనువాదం చేసేటప్పుడు మూలభాషతో సాధారణ పరిచయం ఉంటే చాలు. వార్తాపత్రికల్లో వార్తల అనువాదంలో కూడా అంతే. అయితే విషయంతో మాత్రం తగిన పరిచయం అవసరం. సృజనాత్మక రచనలలో భాషను ఉపయోగించే పద్ధతిలో వైశిష్ట్యం, ప్రత్యేకత ఉంటుంది. సందర్భాన్నిబట్టి చాలా మాటలకు అర్థం మారుతుంది. సామెతలు, జాతీయాలు, నుడికారాలు మొదలైన భాషకు సంబంధించిన ప్రత్యేకతలన్నీ సృజనాత్మక రచనలలో కనిపిస్తాయి. ఈ మెళకువలన్నీ తెలిస్తేనే కాని మూలభాషలోని సృజనాత్మక రచనలకు, వాటిలోని అభివ్యక్తికి సాధ్యమైనంత సమానమైన అభివ్యక్తిని లక్ష్యభాషలో తీసుకుని రావటం కష్టం (రాధాకృష్ణ, 2003).

అనువాదకుడికి మూల, లక్ష్యభాషల పరిణామక్రమం గురించి కూడా తెలిసి ఉండాలి. భాష పరిణామశీలి. భాష నిరంతరం మారుతూ ఉంటుంది. ప్రాచీన కాలపు సాహిత్యాన్ని, ప్రసారసాధనాలను పరిశీలిస్తే, వాటిలో ఉన్న భాష ప్రస్తుతం మనం ఉపయోగించే భాషకు భిన్నంగా ఉంటుంది. కాబట్టి అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు పదజాలం యొక్క ఆధునిక ధోరణులగురించి తెలుసుకోటానికి ప్రయత్నం చేయాలి.

అంతేకాకుండా అనువాదకుడు తర్జుమా చేయటానికి నిఘంటువుల సహాయం కూడా తీసుకోవచ్చు. కాని అన్ని వేళలా నిఘంటువులు అనువాదకుడికి తగినంతగా తోడ్పడవు. నిఘంటువులలో పర్యాయపదాల రూపంలోనో, వివరణల రూపంలోనో సూటిగా అర్థాలుంటాయి. కాని భాషావ్యవహారంలో సందర్భాలూ పక్కన ఉండే పదాలూ పదానికి అర్థాన్నిస్తాయని కూడా సూచించారాయన.

- **విషయజ్ఞానం**

అనువాదకుడికి మూలభాషా జ్ఞానం, లక్ష్యభాషా జ్ఞానం, విషయజ్ఞానం – ఈ మూడూ ఉండటం అవసరం. ఎందుకంటే అనువాదకుడికి కేవలం మూలభాషా జ్ఞానం, లక్ష్యభాషా జ్ఞానం ఉంటే సరిపోదు.

విషయ ప్రధానమైన అనువాదాలు చేయాలంటే అనువాదకుడికి విషయ జ్ఞానం తప్పనిసరి. నిర్మల్ (2000) చెప్పినట్టు, విజ్ఞాన-శాస్త్రీయ విషయాలకు సంబంధించిన గ్రంథాలను అనువదించేటప్పుడు ఆయా విషయాలకు సంబంధించిన సముచిత జ్ఞానం ఉండాలి. కాబట్టి అనువాదకుడికి తాను అనువదిస్తున్న పుస్తకానికి సంబంధించిన సాంకేతిక పదప్రయోగ పరిజ్ఞానం ఖచ్చితంగా ఉండాలి. లేకపోతే అనువాదం దోషయుక్తంగా, అసలు విషయానికి దూరంగా ఉంటుంది.

అనువాదకుడికి మూలభాషా పరిచయం, లక్ష్యభాషాజ్ఞానం, విషయ పరిజ్ఞానం ఈ మూడూ ఉండటం అవసరమని ముందే తెలుసుకున్నాం. ఒక్కొక్కసారి ఈ మూడింటిలో ఏదో ఒకటి అనువాదకుడికి లేకపోవచ్చు. ఉదాహరణకు లక్ష్యభాషాజ్ఞానం, విషయ పరిజ్ఞానం ఉన్నా మూలభాషతో అంతగా పరిచయం లేకపోవచ్చు. అలాంటి సందర్భాలలో మూలభాషా వ్యవహర్తతోగాని, మూలభాషతోగాని పరిచయం ఉన్నవాళ్ల సహాయంతో అనువాదం నిర్వహించవచ్చునని శ్రీ బూదరాజు రాధాకృష్ణగారు (2003) సూచించారు. అదే విధంగా, మూలభాషా పరిచయం, లక్ష్యభాషాజ్ఞానం ఉండి విషయ పరిచయం లేనప్పుడు అనువాదకుడు విషయ పరిజ్ఞానం ఉన్నవాళ్ళ సహాయం తీసుకోవచ్చు.

- **నిజాయితీ**

అనువాదకుడికి ఉండాల్సిన లక్షణాల్లో నిజాయితీని కూడా పేర్కొన్నారు నిర్మల్ (2000). ఆయన అభిప్రాయాన్ని బట్టి ప్రతి వ్యక్తికి తన పరిమితులు ఉంటాయి. ప్రతి అనువాదకుడు ప్రారంభంలోనే మూలభాషలో, లక్ష్యభాషలో సముచిత జ్ఞానం, సంపూర్ణ విషయపరిజ్ఞానం కలిగి ఉంటాడని ఆశించటానికి వీలులేదు. అందువల్ల చక్కగా, సుబోధకంగా, మూలనిష్ఠంగా అంటే మూలంలో ఉన్న భావాన్ని, శైలీవైశిష్ట్యాన్ని లక్ష్యభాషలో అదే విషయంగా అభివ్యక్తీకరించటానికి నిజాయితీగా ప్రయత్నించాలి. మూలభాషలో లేదా లక్ష్యభాషలో తెలియని పదాలు, పదబంధాలు మొదలైనవాటిని అనువదించటానికి అనువాదకుడు నిఘంటువుల సహాయం తీసుకోవచ్చు. లేదా అనుభవజ్ఞులైన విద్వాంసుల దగ్గరకు వెళ్ళి తెలుసుకోవచ్చు. అనువాద ప్రక్రియలో మూలభాషలో పండితుల, లక్ష్యభాషా

వ్యవహర్తల సహాయం తీసుకుని మూలభాషలోని ప్రయుక్తుల అర్థాలను గ్రహించి వాటిని లక్ష్యభాషలో ఉపయోగించే విధానాన్ని తెలుసుకోటానికి హృదయపూర్వకంగా, నిజాయితీగా ప్రయత్నించాలి. ఈ నిజాయితీ పరిమాణాన్నిబట్టి అనువాద స్థాయి సంతృప్తికరంగా ఉంటుంది.

- **అభ్యాసం**

అనువాద ప్రావీణ్యం సాధించటానికి నిరంతర కృషి అత్యవసరం. అది ఒక రోజులో అలవడేది కాదు. అభ్యాసంవల్ల ఏ విద్యనైనా సులభసాధ్యమవుతుంది. "అభ్యాసం కూసు విద్య" – అంటే నిరంతర అభ్యాసంతోనే అనువాదకుడు తన నిపుణతను పెంపొందించవచ్చు. తెలుసుకోవాల్సిన విషయాలను, అనువాద ప్రక్రియలో గుణదోషాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, అనువాదకుడు అవిశ్రాంత బాటసారిలా అనువాద రంగంలో అడుగువేస్తూ ముందుకు సాగుతూ ఉండాలని నిర్మల్ తెలియజేశారు. దీనివల్లనే అనువాదకుడు నిరంతర విద్యార్థి అని కూడా సూచించారు.

- **మూల, లక్ష్య భాషల సంస్కృతి గురించి సముచిత జ్ఞానం**

భాష, సంస్కృతి – ఈ రెండూ అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. ఏ  కాలంలోనైనా ఒక భాష మాట్లాడేవాళ్ళ సంస్కృతి వాళ్ళ పదజాలంలో ఇమిడి ఉంటుంది.

కాబట్టి అనువాదకుడికి భాషాజ్ఞానం తోపాటు మూల, లక్ష్య భాషల సంస్కృతి గురించి కూడా సముచిత పరిజ్ఞానం ఉండాలి. అనువాదకుడు వేరే సంస్కృతులపట్ల గౌరవభావం, ప్రశంస చూపించాలి. అనువాదకుడు వేర్వేరు మూలభాషల రచనలను మూలభాషలోకి తర్జుమా చేస్తాడు. అటువంటప్పుడు మూల, లక్ష్య భాషల సంస్కృతి, ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. అప్పుడే అతను మంచి అనువాదాలు రూపొందించగలడు. అంతేకాకుండా వివిధ సంస్కృతులను వేరుచేసే వైఖరులు మరియు సంప్రదాయాల గురించి అనువాదకుడు బాగా

తెలుసుకోవటంతోపాటు ఈ కారకాలు భాషను ఎలా ప్రభావితం చేస్తాయో అని కూడా అర్థం చేసుకోవాలి.

- **సాంకేతిక పరిజ్ఞానం**

ఈ ఆధునిక కాలంలో సాంకేతిక విజ్ఞానాభివృద్ధివల్ల అనువాదకుడికి సాంకేతిక పరిజ్ఞానం కూడా అవసరమైంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నప్పుడు అనువాద పద్ధతులు కూడా మారవచ్చు. నేడు కృత్రిమ మేధ (Artificial Intelligence (AI)), యాంత్రిక అభ్యసనం (Machine Learning), మొదలైనవి అన్నీ రంగాలలో కొత్త కొత్త మార్పులు తీసుకురావటానికి సిద్ధంగా ఉన్నాయి. విజయవంతమైన అనువాదకులు ఇటువంటి మార్పులనుంచి తప్పించుకోకుండా, వీటిని తమ సామర్థ్యాన్ని మెరుగుపరిచే అవకాశాలుగా భావించాలి.

- **అనువాదకుడు పరిశోధకుడై ఉండాలి.**

అనువాదకుడు నిరంతర విద్యార్థి అని నిర్మల్ (2000) చెప్పారు. దీనితోపాటు అనువాదకుడికి పరిశోధనలు చేయటానికి ఆసక్తి కూడా ఉండాలి. అంటే అనువాదకుడు నిరంతర పరిశోధకుడు కూడా. అనువాదం మొదలుపెట్టే ముందు మూల రచన గురించి వివరాలన్నీ సేకరించాలి.

అసలు అనువాదం–పరిశోధన రెండూ కలసి సాగుతాయని చాలా మంది పరిశోధకులు అభిప్రాయపడతారు. మామూలుగా క్లిష్టమైన అనువాదాలు చేసేటప్పుడు అనువాదకులకు పరిశోధనలు తోడ్పడతాయి. చట్టపరమైన పత్రాలు, సాంకేతిక కరదీపికలు, సృజనాత్మక రచనలు మొదలైనవాటిని అనువదించాలంటే అనువాదకుడు వీటికి సంబంధించిన ప్రత్యేక సందర్భాలతో పాటు అర్థచ్ఛాయాభేదాలను కూడా అర్థం చేసుకోవాలి. కొన్ని పర్యాయాలు అనువాదకులకు వేరొక దేశం

యొక్క న్యాయవ్యవస్థ గురించిగానీ, ఒక వస్తువుకున్న సాంకేతిక లక్షణాలు లేదా సాహిత్య రచనలోని సాంస్కృతిక సూచనలను పరిశోధించాల్సిన అవసరం ఉండవచ్చు.

అనువాదమనేది పరిశోధనల శ్రేణి. ఒక రంగంలో అనువాదకులు ప్రావీణ్యం కలిగి ఉన్నప్పటికీ, సాంకేతిక విజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతుందనేది యథార్థమే. అనువదిస్తున్నప్పుడు వారికి తెలియని కొత్త సమాచారం ఎల్లప్పుడూ ఉంటుంది. అటువంటప్పుడు వారు కేవలం నిఘంటువుల మీద ఆధారపడకుండా వారికి తెలియని వాటిని సరిగ్గా పరిశోధించి, వారికి సరియైన ఆలోచన ఉందని నిర్ధారించుకోవాలి. అందువల్లనే అనువాదంలో పరిశోధన అనివార్యం.

పైన పేర్కొన్నబడినవి మాత్రమే కాకుండా, అనువాదకుడు ఇంకా కొన్ని లక్షణాలు కలిగి ఉండాలి. కేవలం ఒక్క అక్షరమైనా, పదమైనా లేదా యాస అయినా మొత్తం అనువాద అర్థాన్ని మార్చగలదు. కాబట్టి అనువాదకుడు సూక్ష్మ విషయమైనా, దాని పట్ల శ్రద్ధ వహించాలి. ఇంతేకాకుండా నిర్దిష్ట సాంకేతిక పదాల అనువాదంలో వ్యత్యాసాలు ఏర్పడకుండా ఉండటానికి స్థాపించబడిన పదకోశం సంప్రతించటం అవసరం. పాఠకులకు సరియైన భాషాంతరం అందించేలా చేయటానికి, అనువాదకుడు తన అనువాదంలోనున్న ప్రతి అంశం సరియైనదని ధ్రువీకరించటానికి దాన్నీ మళ్ళీ మళ్ళీ పరిశీలించాలి.

అనువాద నాణ్యతను మెరుపరచటమే అనువాదకుల ప్రధాన బాధ్యతగా ఉండాలి. అయినా తమ అనువాదాల గురించి విమర్శను స్వీకరించగలిగే శక్తి కూడా అనువాదకులకు ఉండాలి. ఇటువంటి విమర్శలవల్ల వారు తమ అనువాద సామర్థ్యాలను ఇంకా మెరుగుపరచవచ్చు. అనువాదకుడు సమయ పాలన నిర్వహణ సామర్థ్యాలు (Time Management Skills) కూడా కలిగి ఉండాలి.

కొన్ని పర్యాయాలు అనువాదం ఒత్తిడి కూడిన పనిగా కూడా మారవచ్చు. అటువంటప్పుడు భాష, అనువాదంపట్ల వారికున్న అత్యంత ఆసక్తియే వాళ్ళను ప్రేరేపిస్తుందని గుర్తించాలి. ఈ విధమైన నిష్ఠ, పట్టుదలయే వారిని ఉత్తమ అనువాదకులుగా తీర్చిదిద్దుతాయి.

**ఉపయుక్త గ్రంథాల సూచిక:**


నిర్మల్, బి., 2000. *అనువాదశాస్త్రం.* హైదరాబాదు: తెలుగు అకాడమి.

రాధాకృష్ణ, బి., 2003. *అనువాద పాఠాలు.* హైదరాబాదు: ఆకృతి ఆఫ్ సెట్ ప్రింటర్స్.



అనువాదకుడి లక్షణాలు - Characteristics of a Translator (Notes) © 2024 by Rajwantee Dalliah is licensed under CC BY 4.0


-----★★★★-----